# సాక్షి ఖమ్మం

బుధవారం, 20, సెప్టెంబర్, 2023






**కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ**

ప్రజలు కలలు కన్న బంగారు తెలంగాణ కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఏర్పాటవుతుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తెలిపారు. 8లో



**రైతులకు అండగా డీసీసీబీ**

రుణాల మంజూరుతో రైతులకు డీసీసీబీ అండగా నిలుస్తోందని చైర్మన్ నాగభూషణం, ఎమ్మెల్యే వెంకటవీరయ్య వెల్లడించారు. 8లో

**వాతావరణం**

గరిష్టం / కనిష్టం 34° / 25°

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత పలు ప్రాంతాల్లో ఎండ పెరిగే అవకాశముంది.




# పోస్టులేనట...

**నోటిఫికేషన్‌లోని సంఖ్యపై 'టీచర్' అభ్యర్థుల్లో అసంతృప్తి**

- జిల్లాలో 1,047 ఖాళీలు.. 195 పోస్టులకే టీఆర్టీ నోటిఫికేషన్
- నేటి నుంచి వచ్చేనెల 21 వరకు దరఖాస్తులు
- ఏళ్ల తరబడి సిద్ధమవుతున్న అభ్యర్థులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: సుదీర్ఘకాలం తర్వాత ప్రభుత్వం ఉపాధ్యాయుల భర్తీకి టీఆర్టీ(టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) నోటిఫికేషన్‌ను జారీ చేసింది. అయితే నోటిఫికేషన్‌లో వెల్లడించిన ఖాళీల సంఖ్యతో అభ్యర్థుల్లో నిరాశ నెలకొంది. జిల్లా వ్యాప్తంగా 1,047 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారిక సమాచారం. కానీ కేవలం 195 పోస్టుల భర్తీకే గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అభ్యర్థుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. వేలాది మంది అభ్యర్థులు రూ.వేలు ఖర్చు చేసి నెలల తరబడి శిక్షణ తీసుకుంటున్నారు. ఏళ్ల తర్వాత జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఖాళీల సంఖ్య చూశాక డీఈడీ, బీఈడీ, బీపీఈడీ అభ్యర్థులు నిట్టూరుస్తున్నారు.

**చాలా ఏళ్ల తర్వాత..**

2017లో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైంది. ఆ తర్వాత ఈనెల 8న డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసింది. బుధవారం నుంచి అక్టోబర్ 21లోపు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పీఈటీ), సెకండరీ గ్రేడ్ టీచర్, లాంగ్వేజీ పండిట్ పోస్టులు భర్తీ చేయనుండగా, ఈ ఏడాది నవంబర్ 20 నుంచి 30వ తేదీల మధ్యలో పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత**

జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. జిలాలో మొత్తం 5,759 మంది ఉపాధ్యాయులకు గాను 4,712 మంది విద్యాబోధన చేస్తున్నారు. అంటే 1,047 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో గ్రేడ్–1 ఉపాధ్యాయుల ఖాళీలు 81 ఉన్నాయి. ఇక సబ్జెక్టు ఉపాధ్యాయుల ఖాళీలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ గణితంలో 73 ఖాళీలు, బయాలజీ 116, సాంఘిక శాస్త్రం 169 ఖాళీలు ఉండగా, ఎస్‌జీటీ తెలుగు పోస్టులు 342 ఖాళీగా ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ఉన్న వారిపై భారం పడుతుండగా ఏటా విద్యావలంటీర్లను నియమించి కాలం వెళ్లదీస్తున్నారు.

**ఎస్‌ఏ కొన్ని విభాగాల్లో పోస్టులే లేవు..**

ఓవైపు టీచర్ల ఖాళీల సంఖ్య భారీగా ఉండగా.. కొన్నేళ్ల తర్వాత విడుదల చేసిన నోటిఫికేషన్‌లో 195 పోస్టులనే పేర్కొనడంపై ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి కోచింగ్ తీసుకుంటూ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న నేపథ్యాన తక్కువ పోస్టులే భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. ఎస్‌జీటీ తెలుగు(స్థానికసంస్థలు)కు 74, ఎస్‌జీటీ తెలుగు(ప్రభుత్వ పాఠశాలలు)లో ఆరు పోస్టులు భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే ఎస్‌జీటీ తెలుగు పోస్టులు జిల్లావ్యాప్తంగా 342 ఖాళీ ఉన్నాయి. ఇక 485 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు(ఎస్‌ఏ)ఖాళీగా ఉండగా.. కేవలం 89 పోస్టుల భర్తీకే నోటిఫికేషన్ విడుదలైంది. ఎస్‌ఏల వారీగా చూస్తే.. గణితం, ఫిజికల్‌సైన్స్, ఆంగ్లం సబ్జెక్టులకు సంబంధించి ఒక పోస్టు కూడా నోటిఫికేషన్‌లో లేకపోవడం గమనార్హం.

**సిద్ధమవుతున్న అభ్యర్థులు**

అభ్యర్థులు చాలా ఏళ్లుగా టీచర్ పోస్టుల రాతపరీక్ష కోసం సిద్ధమవుతున్నారు. దాదాపు ఆరేళ్ల క్రితం డీఎస్సీ నోటిఫికేషన్ రాగా.. మళ్లీ ఇప్పుడు వచ్చింది. అయినా అభ్యర్థులు శిక్షణ పొందుతూనే ఉన్నారు. ఎట్టకేలకు ఇప్పుడు నోటిఫికేషన్ రావడంతో అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. అలాగే, స్థానికంగా కొందరు, హైదరాబాద్ వంటి నగరాలకు మరికొందరు శిక్షణకు వెళ్తున్నారు. ఇంకొందరు ఇళ్ల దగ్గరే చదువుతూ గ్రంథాలయాల్లోని పుస్తకాలను వినియోగించుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. ఏదిఏమైనా జిల్లాలో తక్కువ పోస్టులు ఉండడం, అర్హులైన వారు భారీగా ఉన్న నేపథ్యాన గత డీఎస్సీలతో పోలిస్తే ఈసారి పోటీ ఎక్కువగానే ఉండనుంది.

| నోటిఫికేషన్‌లో పేర్కొన్న పోస్టులు | స్కూల్ అసిస్టెంట్ | లాంగ్వేజీ పండిట్ | పీఈటీ | ఎస్‌జీటీ | మొత్తం |
|---|---|---|---|---|---|
| | 89 | 13 | 10 | 83 | 195 |

# హెచ్‌ఎంల బదిలీలు పూర్తి

- 64 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు నిర్ధారణ
- కోర్టు తీర్పుతో వేగంగా పదోన్నతులు, బదిలీల ప్రక్రియ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న హెచ్‌ఎంల బదిలీ ప్రక్రియ పూర్తయింది. ప్రభుత్వ పాఠశాలల్లోని 14మంది, జిల్లా పరిషత్‌కు సంబంధించి 99మంది హెచ్‌ఎంల బదిలీ చేపట్టారు. ఈమేరకు ఉత్తర్వులు అందజేయగా ప్రధానోపాధ్యాయులు నూతన స్థానాల్లో మంగళవారం విధుల్లో చేరారు.

**ఖాళీల లెక్క తేలింది..**

జిల్లాలో హెచ్‌ఎంల బదిలీలు పూర్తికావడంతో మొత్తం 64ఖాళీలు ఉన్నట్లు విద్యాశాఖ గుర్తించింది. తద్వారా సీనియారిటీ మేరకు అంతే సంఖ్యలో స్కూల్ అసిస్టెంట్లు హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందనున్నారు. ఈ ప్రక్రియ రెండు, మూడు రోజుల్లో పూర్తయ్యే అవకాశముంది. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ నిర్వహించేందుకు కోర్టు సైతం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మరింత వేగం పెంచేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

**3,766దరఖాస్తులు**

జిల్లాలో బదిలీల కోసం 3,766దరఖాస్తులు రాగా 87 తిరస్కరించారు. గ్రీవెన్స్ ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో 328పరిష్కరించగా.. 47 తిరస్కరించినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే, అనారోగ్యకారణాలతో 207 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో కూడా 31 దరఖాస్తులను తిరస్కరించారు. అయితే, అప్పీల్ కోసం రెండు రోజుల సమయం ఇవ్వగా... వీటిని ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరిస్తారు. ఇక అనారోగ్య కారణాలతో అందిన 93 దరఖాస్తులను మరోమారు పరిశీలించాలని నిర్ణయించారు.

**పారదర్శకంగా ప్రక్రియ**


ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను పారదర్శకంగా చేపడుతున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశమై మాట్లాడారు. హెచ్‌ఎంల బదిలీ ప్రక్రియ పూర్తయినందున ఖాళీలను స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించడం ద్వారా భర్తీ చేస్తామని తెలిపారు. ఆతర్వాత స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు, ఎస్జీటీలకు పదోన్నతి, బదిలీలు చేపడతామని తెలిపారు. కాగా, దరఖాస్తుల్లో ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చిన వారు సరిదిద్దుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. అయితే, రోస్టర్, మెరిట్ లేకపోవడంతో స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి సందర్భంగా తప్పులు జరుగుతున్నాయని పేర్కొన్న యూనియన్ల ప్రతినిధులు.. 317 జీఓ ద్వారా బదిలీ అయిన వారి విషయంలో ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించాలని, జీఓ 42 ప్రకారం దివ్యాంగుల ప్రమోషన్లలో రిజర్వేషన్ పాటించాలని కోరారు.

**వచ్చే నెలాఖరులోగా 'మన ఊరు–మన బడి'**

జిల్లాలో మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా మొదటి విడత పాఠశాలల్లోని పనులను అక్టోబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో విద్యాశాఖ, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ పనులు పూర్తయ్యేలా ఎంఈఓలు, హెచ్‌ఎంలు చొరవ చూపాలని చెప్పారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఈఓ సోమశేఖరశర్మ పాల్గొన్నారు.

# ఆయన కాంగ్రెస్‌కు అవసరమా?

- తుమ్మల నాగేశ్వరరావుపై రాయల వ్యాఖ్యలు
- పార్టీలో చేరక ముందు అనుచరులతో భేటీలో చర్చ
- తాజాగా వైరల్ అయిన వీడియో




సాక్షిప్రతినిధి, ఖమ్మం: పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్‌లో దుమారం లేచింది. టికెట్ ఎవరికి ఇస్తారన్నది ఇంకా తేలకున్నా విమర్శల పర్వం మొదలైంది. హైదరాబాద్‌లో జరిగిన విజయభేరి సభకు ముందు రోజు పార్టీ నాయకుడు రాయల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలతో ఆ పార్టీలో విమర్శలు, విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఈసందర్భంగా మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఉద్దేశించి రాయల చేసిన వ్యాఖ్యల వీడియో మంగళవారం వైరల్ అయింది. దీంతో ప్రతిగా తిరుమలాయపాలెం మండలానికి చెందిన పార్టీ నాయకులు రాయల తీరుపై మండిపడ్డారు. పాలేరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ కోసం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు రాయల, మువ్వా విజయ్‌బాబు, మద్ది శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు దరఖాస్తు చేసుకున్నారు. ఇంతలోనే తుమ్మల కూడా పార్టీలో చేరడంతో టికెట్ ఎవరికి కేటాయిస్తారోనని నియోజకవర్గ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.

**కాంగ్రెస్ జెండా ఉండొద్దన్నారు..**

ఈనెల 17న తుక్కుగూడలో విజయభేరి సభ జరగగా, రాయల నాగేశ్వరరావు 16వ తేదీన పాలేరు నియోజకవర్గానికి చెందిన అనుచులతో ముదిగొండ మండలం వెంకటాపురంలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా వాహనాల ఏర్పాటు, శ్రేణుల తరలింపుపై చర్చించగా, తుమ్మల చేరిక అంశమై ప్రస్తావన వచ్చింది. దీంతో రాయల మాట్లాడుతూ 'తన అనుచరుడిని చంపిన వారికి గన్‌మెన్లను ఇచ్చినా చూస్తూ ఉన్నారే తప్ప ఏమీ చేయలేకపోయారు. ఇలాంటి వ్యక్తి మనల్ని రక్షిస్తాడా?' అని తుమ్మలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండి ఏ రోజైనా కూసుమంచిలో నిద్ర చేశాడా.. ఇలాంటి వ్యక్తి కాంగ్రెస్‌కు అవసరమా.. టీడీపీలో కొనసాగినప్పుడు కాంగ్రెస్ కండువా, జెండా ఉండడానికి వీల్లేదన్న వ్యక్తి మనకు అవసరమా' అని ఆయన చేసిన వ్యాఖ్యల వీడియో వైరల్ అయింది.

**స్వార్థం కోసమే పార్టీపై ఆరోపణలు**

తిరుమలాయపాలెం జెడ్పీటీసీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బెల్లం శ్రీనివాస్ మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రాయలపై విమర్శలు చేశారు. మంత్రులుగా పనిచేసిన సంభాని చంద్రశేఖర్, రామిరెడ్డి వెంకటరెడ్డి కుటుంబీకులు టికెట్ రాకపోయినా కాంగ్రెస్‌కు పనిచేశారన్నారు. పార్టీలోకి వచ్చిన కొద్ది సమయంలోనే ఎమ్మెల్సీగా పోటీచేసే అవకాశం కల్పించిన రాయల మరిచిపోయి ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. బీఆర్‌ఎస్ మంత్రిని కలిశాకే రాయల ఈ ఆరోపణలు చేశారని బెల్లం శ్రీనివాస్ ప్రస్తావించడం గమనార్హం. ఇలా ఇరువర్గాల వ్యాఖ్యలతో పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్‌లో అంతర్గతంగా ఉన్న విభేదాలు బయటపడినట్లయింది. టికెట్ కోసం ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తుండగా.. తాజా ఘటనలు ముఖ్యనేతలకు తలనొప్పి తెచ్చిపెట్టేలా ఉన్నాయి.

**అప్పుడు అన్నాను...**

తుమ్మల నాగేశ్వరరావుపై చేసిన వ్యాఖ్యల విషయమై రాయల నాగేశ్వరరావు 'సాక్షి'తో మాట్లాడుతూ తుమ్మల పార్టీ కండువా కప్పుకోకముందు అనన్న మాటలను ఎవరో కావాలని వైరల్ చేశారని పేర్కొన్నారు. తుమ్మల పార్టీలో చేరకముందే తాను ఈ వ్యాఖ్యలు చేశానని, పార్టీ కండువా కప్పుకున్నాక అందరం పార్టీ లైన్‌లోనే ఉండాలని, పార్టీ ఆదేశం మేరకే నడుచుకోవాలే తప్ప ఉల్లంఘించొద్దన్నారు. ఇక బీఆర్‌ఎస్ మంత్రిని తాను కలవడం అవాస్తవమని, ఈ ఆరోపణ చేసిన వారు నిరూపించాలని సవాల్ చేశారు.

# ప్రజాస్వామ్యం, లౌకిక శక్తుల రక్షణే ధ్యేయం

- మతోన్మాదులను నిలువరించండి
- జనసేవాదళ్ శిక్షణ ముగింపులో సీపీఐ జాతీయ నేత నారాయణ



గౌరవ వందనం స్వీకరిస్తున్న నారాయణ, కూనంనేని తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజాస్వామ్యంతో పాటు లౌకికశక్తుల పరిరక్షణే ధ్యేయంగా జనసేవాదళ్ కార్యకర్తలు పని చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సూచించారు. మతోన్మాద శక్తుల నుంచి దేశాన్ని కాపాడేలా జన సేవాదళ్ రెడ్ ఆర్మీలా పనిచేయాలన్నారు. వివిధ రాష్ట్రాల కార్యకర్తలకు పది రోజులుగా ఖమ్మంలో ఇస్తున్న శిక్షణ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా నారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితరులు గౌరవ వందనం స్వీకరించగా నారాయణ మాట్లాడారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు గడిచిన సందర్భంగా 2024 డిసెంబర్ 26న ఢిల్లీలో లక్ష మంది జనసేవాదళ్ కార్యకర్తలతో ఎర్ర కవాతు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని మాట్లాడుతూ.. యువతతోనే సమాజ మార్పు త్వరగా సాధ్యమవుతుందని తెలిపారు. పాలకుల నిర్ణయాలతో నైరాశ్యంలో ఉన్న యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ నాయకుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌తోపాటు మహ్మద్ మౌలానా, నార్ల వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# క్రమబద్ధీకరణను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఏర్పరచుకున్న వారు క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం జీఓ 58 ద్వారా అవకాశం కల్పించినందున ప్రక్రియలో వేగం పెంచాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ క్రమబద్ధీకరణ కోసం 17,046 దరఖాస్తులు రాగా, 14,266 దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని తెలిపారు. మిగతావి కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి అన్ని వివరాలు సేకరించాలని చెప్పారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఖమ్మం ఆర్డీఓ జి.గణేష్, ఎస్‌డీసీ రాజేశ్వరి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, ఆర్డీఓ కార్యాలయ డీఏఓ శైలజ, తహసీల్దార్ సీహెచ్.స్వామి తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

**పార్లమెంట్ ఫొటో సెషన్‌లో ఎంపీలు**



ఎంపీలు నామ, రవిచంద్ర, పార్థసారథిరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: పార్లమెంట్ వద్ద మంగళవారం ఎంపీలతో ఫొటో సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన ఎంపీ నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డిలో సహచర ఎంపీలతో కలిసి ఫొటో దిగారు.

**82 మందికి సదరమ్ సర్టిఫికెట్లు**

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం సదరమ్ క్యాంపు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల దివ్యాంగులు 125 మంది స్లాట్ బుక్ చేసుకోగా 109 మంది హాజయ్యారు. వీరిని వివిధ విభాగాల వైద్యులు పరీక్షించాక 82 మందిని సదరమ్ సర్టిఫికెట్‌కు అర్హులుగా నిర్ధారించారు.

**నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం**

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 విద్యాసంవత్సరానికి 9, 11 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణం తెలిపారు. అక్టోబర్ 31 నాటికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, విద్యార్థులకు వచ్చేఏడాది ఫిబ్రవరి 10న ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 8, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు www.navodaya.gov.in వెబ్‌సైట్ దరఖాస్తు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**మెడికల్ కళాశాలలో తరగతులు ప్రారంభం**



పాఠం బోధిస్తున్న మైక్రోబయాలజీ ప్రొఫెసర్

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు మంగళవారం తరగతులు ప్రారంభమయ్యాయి. తొలిరోజు మూడు విభాగాల ప్రొఫెసర్లు పాఠాలు బోధించగా, త్వరలోనే పూర్తిస్థాయి తరగతులు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు తెలిపారు. కాగా, బాలికలు, బాలుర హాస్టళ్లలో ఇప్పుడిప్పుడే విద్యార్థులు చేరుతున్నారు. ఈనెల 15వ తేదీన సీఎం కేసీఆర్ వర్చువల్‌గా మెడికల్ కళాశాలను ప్రారంభించగా, 100 ఎంబీబీఎస్ సీట్లు పూర్తిగా భర్తీ అయ్యాయి.

**ఐటీఐల్లో స్పాట్ ప్రవేశాలు**

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాసరావు తెలిపారు. ఎలక్ట్రీషియన్, డీఎం సివిల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, సోలార్ టెక్నీషియన్, ఐటీటీ అగ్రికల్చర్, వెల్డర్, సీఓపీఏ, డ్రెస్ మేకింగ్ ట్రేడ్లలో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 20నుంచి 23వ తేదీ వరకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు. ఐటీఐ రిజిస్ట్రేషన్ ఫారం, ఎస్సెస్సీ లాంగ్ మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్, టీసీతో హాజరుకావాలని తెలిపారు.

# పెద్దాస్పత్రి కిటకిట



ఆస్పత్రి లోపల రద్దీ (ఇన్‌సెట్) ఓపీ వద్ద బారులు దీరిన ప్రజలు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మంగళవారం చికిత్స కోసం వచ్చిన వారితో కిటకిటలాడింది. వరుసగా రెండు రోజులు సెలవు కావడంతో మంగళవారం ఎక్కువ మంది వైద్యపరీక్షలకు వచ్చారు. దీనికి తోడు వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పుల కారణంగా డెంగీ, విషజ్వరాలు సోకుతుండటంతో ప్రజలు ఆస్పత్రుల బాట పడుతున్నారు. ఈమేరకు ఓపీ కౌంటర్ వద్ద భారీ క్యూలైన్ ఏర్పడగా... వివిధ విభాగాల వైద్యులకు చూపించుకునేందుకు గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది. ఇక పరీక్షలు చేయించుకుని, మందులు తీసుకుని బయటకు వచ్చే సరికి చాలా సమయం పట్టడంతో చిన్నపిల్లలతో పాటు వచ్చిన వారు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# ఆరు రోడ్లు.. రూ.12.40కోట్లు

- మంత్రి పువ్వాడ కృషితో నిధుల మంజూరు
- రఘునాథపాలెం మండలంలో డొంక రోడ్లకు మహర్దశ

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాలకు అనుసంధానమైన డొంక(లింక్) రోడ్లకు మహర్దశ పడుతోంది. ఈమేరకు ఆరు రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.12.40కోట్లు మంజూరు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కృషితో గత ఆగస్టులోనే ఆరు డొంక రోడ్లను బీటీగా అభివృద్ధి చేసేందుకు రూ.13.10కోట్లు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయి. ఇంతలోనే మరో ఆరు రహదారుల అభ్వివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. ఆయా గ్రామాల్లోని ప్రజలు, రైతుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సిఫారసుతో గ్రామీణ రహదారుల నిర్మాణం(సీఆర్ఆర్) గ్రాంట్ నుండి నిధులు మంజూరు చేస్తూ పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు విడుదల చేశారు.

**ఎక్కడెక్కడ?**

మండలంలోని ఆరు డొంక రోడ్లను బీటీగా మార్చేందుకు ఉత్తర్వులు విడుదల చేయగా, అందులో వివరాలను వెల్లడించారు. గణేశ్వరం నుండి దొనబండ రోడ్డుకు రూ.3.30 కోట్లు, రఘునాథపాలెం నుండి జింకల్ తండా జెడ్పీ రోడ్డు వరకు రూ.2.50 కోట్లు. బంజర నుండి మూలగుడెం వరకు రూ.1.40కోట్లు, కే.వీ.బంజర నుండి మూలగూడెం వరకు రూ.1.20 కోట్లతో బీటీగా అభివృద్ధి చేస్తారు. అలాగే, రఘునాథపాలెం బైపాస్ నుండి నర్సింహులు చెరువు వరకు రూ.1.15 కోట్లు, కోటపాడు నుండి పాపటపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు రూ.2.85 కోట్లు వెచ్చిస్తారు. కాగా, అడిగిన వెంటనే రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కృతజ్ఞతలు తెలపగా, తమ అభ్యర్థనతో నిధులు మంజూరు చేయించడంపై మంత్రికి గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

**శరవేగంగా రోడ్ల నిర్మాణం**

గత నెలలో ఆరు డొంక రోడ్లను బీటీగా అభివృద్ధి చేసేందుకు రూ.13.10కోట్లు విడుదల చేయగా, పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే పనుల్లో 50శాతం మేర పూర్తయ్యాయని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. గతంలో ఆ రోడ్లపై పంట పొలాలకు వెళ్లాలంటే రైతులు అవస్థ పడేవారు. ఇప్పుడు బీటీ రోడ్లుగా అభివృద్ధి చేస్తుండడంతో రైతులు పొలాలకు వెళ్లాలన్నా, పంట ఉత్పత్తులతో రావాలన్నా ప్రయాణం సాఫీగా సాగనుంది.



బీటీగా మార్చేందుకు చదును చేసిన డొంక రోడ్డు

**సెల్ఫీ విత్ గణేష్**



పర్యావరణ పరిరక్షణలో మీరు భాగమై మట్టి గణేషుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారా? జిల్లాలోని అపార్ట్‌మెంట్లు, కాలనీలు లేదా ఇళ్లలో ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిమను ఏర్పాటుచేశారా? అయితే, మీ విగ్రహ ప్రత్యేకతలను 'సాక్షి' పాఠకులతో పంచుకోండి. మట్టి, ప్రత్యేక ఆకృతుల్లోని విగ్రహాలతో సెల్ఫీ దిగి వాట్సప్ చేయండి. మీ పేరు, చిరునామా స్పష్టంగా ఉండాలి. మాకు అందిన ఫొటోల్లో ఎంపిక చేసిన వాటిని ప్రచురిస్తాం.

వాట్సాప్ చేయాల్సిన నంబర్ :

98498 08197

# కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ

- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- 'గ్యారంటీ' కార్డులతో ఇంటింటి ప్రచారం


చింతకాని : నాగులవంచలో గ్యారంటీ కార్డులతో ప్రచారం చేస్తున్న భట్టి విక్రమార్క, నాయకులు

**చింతకాని/బోనకల్:** ప్రజలు ఆకాంక్షించిన బంగారు తెలంగాణ కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందని సీఎల్పీ నేత, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. చింతకాని మండలం నాగులవంచ, బోనకల్ మండలం నాగులవంచలో పర్యటించిన ఆయన విజయభేరి సభలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ కార్డులతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేందుకే కాంగ్రెస్ ఆరు పథకాలను ప్రకటించిందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఈ పథకాలను అమలుచేస్తామని వెల్లడించారు. కాగా, తెలంగాణ ఏర్పడి పదేళ్లయినా బీఆర్ఎస్ తీరుతో పేదప్రజల బతుకులు మారడం లేదన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజల సొమ్మును దోచుకుంటున్నాయని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడం ద్వారా బీజేపీ, బీఆర్ఎస్‌కు బుద్ధిచెప్పాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు అంబటి వెంకటేశ్వరరావు, కొమ్మినేని రమేష్‌బాబు, గాలి దుర్గారావు, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సూరంశెట్టి కిషోర్, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తోటకూరి ప్రగతి, మడుపల్లి భాస్కర్, కూరపాటి కిషోర్, కొప్పుల గోవిందరావు, కన్నెబోయిన గోపి, బందెల నాగార్జున్, ఆలస్యం బస్వయ్య, ఆలస్యం నాగమణి, నారపోగు కొండలరావు, కంభం సరోజిని, బొర్రా ప్రసాద్‌రావు, నారపోగు యాకోబు, ఓర్సు వీరభద్రం, పైడిపల్లి కిశోర్ కుమార్, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మోదుగు సుధీర్ బాబు, అయిలూరి వెంకటేశ్వరెడ్డి, కర్నాటి రమకోటేశ్వరావు, మారుపల్లి ప్రేమ్, చేబ్రోలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు..**

**సత్తుపల్లి/కల్లూరు రూరల్:** తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ వైపు ప్రజలు చూస్తున్నారని.. తాజాగా ప్రకటించిన గ్యారెంటీ స్కీంలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ఎం.డి. ఆరిఫ్ నసీంఖాన్ సూచించారు. సత్తుపల్లిలో మట్టా దయానంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడిన ఆయన కల్లూరు మండలం కొర్లగూడెంలో పీసీసీ ఉపాధ్యక్షుడు సంభాని చంద్రశేఖర్‌తో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆరిఫ్ నసీంఖాన్ మాట్లాడుతూ విజయభేరి సభలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై మొదటి కేబినెట్ భేటీలోనే నిర్ణయం తీసుకోవడంతో పాటు వంద రోజుల్లో అమలుచేస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో పదికి పది అసెంబ్లీ స్థానాలను గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సత్తుపల్లి సమావేశంలో డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడగా తొలుత మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో వక్కలగడ్డ సోమచంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, నున్నా రామకృష్ణ, నారాయణవరపు శ్రీనివాస్, మలిరెడ్డి మురళీరెడ్డి, కమల్‌పాషా, గాదె చెన్నారావు, చల్లారి వెంకటేశ్వరరావు, ఎం.డీ.ఫయాజ్ అలీ, సందీప్‌గౌడ్, దొడ్డా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఇక కొర్లగూడెం సమావేశంలో బైరెడ్డి మనోహర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, శివవేణు, సాల్మన్‌రాజు, చంద్రశేఖర్ రెడ్డి, రాజబాబు, సుధాకర్, అప్పారావు, రఘుపతిరెడ్డి, కిరణ్‌కుమార్, మానవతారాయ్, జనార్దన్, కృష్ణవేణి, పుల్లారావు, లక్ష్మణ్‌రావు, కృష్ణారెడ్డి, లోకేశ్వరరావు, సురేష్, కాటేపల్లి కిరణ్ పాల్గొన్నారు.


సత్తుపల్లి : పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు నసీంఖాన్, దయానంద్, రాగమయి తదితరులు


రఘునాథపాలెం : హామీల పోస్టర్లతో పాండే, వీహెచ్, జావీద్, నాయకులు

**ఆరు హామీలు అమలుచేస్తాం...**

**రఘునాథపాలెం:** తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ ఇచ్చిన హామీలన్నీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలవుతాయని సీడబ్ల్యూసీ సభ్యుడు అవినాష్ పాండే పేర్కొన్నారు. హామీల పోస్టర్లతో రఘునాథపాలెం మండలం శివాయిగూడెంలో మాజీ ఎంపీ వి.హన్మంతరావుతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ప్రతీ హామీని నెరవేర్చగలిగే కాంగ్రెస్‌ను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. నాయకులు మహమ్మద్ జావీద్, పుచ్చకాయల వీరభద్రం, దొబ్బల సౌజన్య, హుస్సేన్, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, భూక్యా బాలాజీ, కె.నాగేశ్వరావు, రాణిఅశోక్, రెంటాల ప్రసాద్, ధరావత్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా డీసీసీబీ

రుణాల పంపిణీలో చైర్మన్ నాగభూషణం


చెక్కు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, ఎమ్మెల్యే సండ్ర

**పెనుబల్లి:** రైతులకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అండగా నిలస్తోందని డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం వెల్లడించారు. ఇటీవల పలువురు రైతుల రుణాలు మాఫీ కాగా, వారికి కొత్తగా మంజూరు చేసిన రుణాలను మంగళవారం ఆయన సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి అందజేశారు. పెనుబల్లిలోని డీసీసీబీ వద్ద కల్లూరు మండల కొర్లగూడెం సొసైటీ పరిధి రైతులు వంద మందికి రూ.75 లక్షల రుణాలను అందజేశాక నాగభూషణం, వెంకటవీరయ్య మాట్లాడారు. కుటుంబానికి రూ.లక్ష వరకు కేసీఆర్ ప్రభుత్వం రుణమాఫీ చేసినందున, ఆయా రైతులు కొత్తగా రుణాలు తీసుకోవచ్చని తెలిపారు. కాగా, కాంగ్రెస్ పార్టీ పాలించినప్పుడు ప్రజలకు ఏమీ చేయకపోగా, ఇప్పుడు గ్యారెంటీ స్కీంలతో తప్పుదోవ పట్టిస్తోందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో కొర్లగూడెం పీఏసీఎస్ అధ్యక్షుడు కీసర వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, ఎంపీపీ లక్కినేని అలేఖ్య, నీలాద్రి ఆలయ కమిటీ చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# చదువుకున్న పాఠశాలకే హెచ్‌ఎంగా..


హెచ్‌ఎం రమేష్‌ను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

**నేలకొండపల్లి:** ఒకప్పుడు చదువుకున్న పాఠశాలలోనే ప్రధానోపాధ్యాయుడిగా పోస్టింగ్ రావడంతో ఆ ఉపాధ్యాయుడిని ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. నేలకొండపల్లికి చెందిన గోపగాని రమేష్ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6నుంచి 10వ తరగతి వరకు చదువుకున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న హెచ్‌ఎంల బదిలీల్లో భాగంగా ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మి ఖమ్మం మామిళ్లగూడెం ఉన్నత పాఠశాలకు బదిలీ కాగా, ఖమ్మంలో పనిచేస్తున్న రమేష్‌ను నేలకొండపల్లికి కేటాయించారు. దీంతో మంగళవారం ఆయన విధుల్లో చేరగా, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు జెర్రిపోతుల సత్యనారాయణ, రత్నకుమార్, రమేష్ తదితరులు సన్మానించారు.

# ఉరి వేసుకుని ఏఆర్ ఎస్సై ఆత్మహత్య


శోభన్‌బాబు (ఫైల్)

**సత్తుపల్లి:** సత్తుపల్లి మండలం గంగారంలోని 15వ బెటాలియన్‌లోని విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్ఎస్ఐ పగిడ శోభన్‌బాబు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం బావురుగొండ గ్రామంలో పొలం వద్ద మంగళవారం ఆయన ఉరి వేసుకున్నారు. మెడికల్ లీవ్‌లో సోమవారం ఇంటికి వెళ్లిన ఆయన శోభన్‌బాబు.. పొలం వద్దే ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇందుకు కారణాలు తెలియాల్సి ఉంది. ఆయన భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తుండగా, బెటాలియన్ కమాండెంట్ పి.వెంకటరాములు, అధికారులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

## క్లుప్తంగా


### అండర్-16 క్రికెట్ టోర్నీ ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

**ఖమ్మంస్పోర్ట్స్:** ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-16 క్రికెట్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ పోటీలు నిర్వహిస్తుండగా తొలి మ్యాచ్ పాల్వంచ-మధిర మధ్య జరగగా పాల్వంచ జట్టు విజయం సాధించింది. తర్వాత వైరా- కొత్తగూడెం జట్లు తలపడగా వైరా జట్టు, భద్రాచలం-ఇల్లెందు నడుమ మ్యాచ్‌లో భద్రాచలం జట్టు గెలిచింది. కాగా, మ్యాచ్‌లను అసోసియేషన్ బాధ్యుడు ఎండీ ఫారుఖ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రికెట్ అసోసియేషన్ కోఆర్డినేటర్ ఎండీ మక్సూద్ మాట్లాడుతూ.. అండర్-16 విభాగంలో బాలికల క్రికెట్ జట్టును సిద్ధం చేస్తున్నామని, త్వరలోనే నెట్స్‌లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

### కెప్టెన్ జలగం రామారావు మృతి

**మాజీ ముఖ్యమంత్రి వెంగళరావుకు సోదరుడు**


జలగం రామారావు (ఫైల్)

**సత్తుపల్లి:** మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు సోదరుడు జలగం రామారావు (94) మంగళవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో కన్నుమూశారు. నేవీలో కెప్టెన్‌గా విధులు నిర్వర్తించిన ఆయన ఉమ్మడి జిల్లా వాసులకు సుపరిచితులు. ఆల్ ఇండియా వెలమ సంఘం అధ్యక్షుడిగా, పర్యావరణ సంఘం సభ్యుడిగా గతంలో సేవలందించారు. భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం అంకంపాలెం, పట్వారిగూడెంల్లో భూములు కోల్పోయిన గిరిజనుల పక్షాన పోరాడి తిరిగి ఇప్పించారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు తదితరులు రామారావు మృతదేహం వద్ద నివాళులర్పించారు. అలాగే, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, కొండూరు సుధాకర్, మానవతారాయ్ తదితరులు రామారావు మృతిపై సంతాపం తెలిపారు.

### అన్నం ఫౌండేషన్‌కు రూ.8లక్షల విలువైన సామగ్రి


సరుకుల జాబితా అందజేస్తున్న ఏసీపీ హరికృష్ణ

**ఖమ్మంఅర్బన్:** ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్‌కు హైదరాబాద్‌కు చెందిన షేర్‌దా విజన్ ఫౌండేషన్ వారు రూ.8లక్షల విలువైన సామగ్రి సమకూర్చారు. బియ్యం, నిత్యావసర సరుకులతో పాటు బట్టలు, వంటపాత్రలను మంగళవారం వితరణగా అందజేయగా, నగర ఏసీపీ హరికృష్ణ పాల్గొని మాట్లాడారు. మతిస్థిమితం వ్యక్తులు, దివ్యాంగులకు అన్నం ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలు అభినందనీయమని, వీరికి షేర్‌దా విజన్ ఫౌండేషన్ అండగా నిలవడాన్ని కొనియాడారు. అనంతరం ఏసీపీతో పాటు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావును పలువురు సన్మానించారు.

### టీబీ నిర్మూలన అందరి బాధ్యత


బిల్లుపాడు సెంటర్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న సుబ్బారావు

**తల్లాడ:** టీబీ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నందున ప్రజలు కూడా సహకరించాలని జిల్లా టీబీ నిర్మూలన అధికారి డాక్టర్ సుబ్బారావు సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని మంగళవారం తనిఖీ చేసిన ఆయన ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. తెలంగాణను 2025 కల్లా టీబీ రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీల్లో రికార్డులు పరిశీలించిన ఆయన బిల్లుపాడు, మిట్టపల్లి హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను కూడా తనిఖీ చేశారు. ఉద్యోగులు పుల్లయ్య, భాస్కర్, సురేష్, సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

| | గరిష్ట | కనిష్ట |
|---|---|---|
| పెసలు | 8,325 | 5,500 |
| కందులు | 10,500 | 4,300 |
| మిర్చి | 19,000 | 13,500 |
| ఏసీ మిర్చి | 24,125 | 18,500 |
| మిర్చి తాలు | 8,000 | 6,000 |
| పత్తి | 7,250 | 5,000 |

- ఖమ్మం వ్యవసాయం

# అంగన్‌వాడీలను పర్మనెంట్ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామయ్య

**ఖమ్మంమయూరిసెంటర్:** అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మనెంట్ చేయడమే కాక కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య డిమాండ్ చేశారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల్లో ఎక్కువమంది బడుగు, బలహీన వర్గాల వారేనని తెలిపారు. సమస్యల పరిష్కారానికి వీరు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకవడం సరికాదన్నారు. ఇకనైనా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కొయ్యల శ్రీనివాస్, కంకణల శ్రీను, పేరబోయిన వెంకన్న, గురవయ్య, నారాయణ, రమేష్, జెట్టి గురవయ్య, ములకలపల్లి లక్ష్మీనారాయణ, జలగం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బంక్‌లో పెట్రోల్ కల్తీ


బాటిల్‌లో అడుగుకు చేరిన నీరు

**సత్తుపల్లిరూరల్:** సత్తుపల్లి మండలం కిష్టారం వై-జంక్షన్‌లో ఉన్న బంక్‌లో పెట్రోల్ కల్తీ చేస్తున్నారని వాహనదారులు ఆరోపించారు. ఓ వ్యక్తి మంగళవారం బాటిల్‌లో లీటర్ పెట్రోల్ పోయించుకోగా అడుగు భాగాన నీరు కనిపించింది. దీంతో మరికొందరు వాహనదారులతో కలిసి ఆయన బంక్ నిర్వాహకులను నిలదీశాడు. ఇకనైనా అధికారులు స్పందించి బంక్‌ల్లో తనిఖీలు చేపట్టి కల్తీ జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు.

## పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి

**కామేపల్లి:** పాతకక్షల నేపథ్యాన ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన మండలంలోని పండితాపురంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొమ్మగాని పిచ్చయ్యపై అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడిలో పిచ్చయ్య ఎడమ చెయ్యి విరగగా, కుటుంబీకులకు చికిత్స నిమిత్తం 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలానికి ఎస్సై ప్రవీణ్‌కుమార్ చేరుకుని విచారణ చేపట్టారు.



## లారీ డ్రైవర్‌ను చితకబాదిన యువకులు

**ఖమ్మంఅర్బన్:** పంచదార బస్తాల లోడ్‌తో వెళ్తున్న లారీ తమ ద్విచక్ర వాహనానికి తాకిందంటూ కొందరు యువకులు లారీ డ్రైవర్‌ను చితకబాదిన ఘటన ఇది. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలానికి లారీ యజమాని, డ్రైవర్ అయిన జి.నర్సింహారావు ఆదివారం రాత్రి పంచదార బస్తాల లోడ్‌తో వస్తున్నాడు. ఖమ్మంలో రెండు చోట్ల సరుకు దించాక సత్తుపల్లికి వెళ్తుండగా ఖమ్మం టూటౌన్ పోలీసుస్టేషన్ సమీపాన తమ ద్విచక్ర వాహనాన్ని లారీ తాకిదంటూ దానవాయిగూడెంకు చెందిన కొందరు యువకులు డ్రైవర్‌పై దాడి చేశారు. అనంతరం ఇరు వర్గాలు పోలీసుస్టేషన్‌కు వెళ్లి కానిస్టేబుల్‌కు వివరాలు వెల్లడించగా, లోడ్ దించి రావాలని లారీ డ్రైవర్‌కు చెప్పాడు. దీంతో నర్సింహారావు వెళ్తుండగా యువకులు మళ్లీ వెంబడించి ఎస్ఆర్ గార్డెన్ సమీపాన చితకబాదాడు. దీంతో ఆయన డయల్ 100కు ఫోన్ చేయడంతో విధుల్లో ఉన్న పోలీసులు వచ్చి యువకులను మందలించి వదిలేశారు.

## కర్రాలపాడులో కోతుల కళేబరాలు

**పెనుబల్లి:** మండలంలోని కర్రాలపాడులో గుర్తుతెలియని వ్యక్తులు పెద్దసంఖ్యలో కోతులను చంపేశారు. ఈ విషయమై ప్రచారం జరగడంతో వెటర్నరీ, అటవీ అధికారులు గ్రామంలో సోమవారం ఆరా తీస్తుండగా, చెరువుకట్ట వద్ద సంచుల్లో మూటకట్టిన కోతుల కళేబరాలు లభ్యమయ్యాయి. కోతులకు అరటికాయల్లో విషం పెట్టి చంపినట్లు సమాచారం. ఈమేరకు బాధ్యులను గుర్తించి శిక్షించాలని స్థానికులు కోరారు.

## రూ.9లక్షల విలువైన గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

**ఖమ్మం క్రైం/మధిర:** విజయవాడ వైపు నుంచి ఖమ్మం వైపు వస్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో మంగళవారం జీఆర్పీ, ఎక్సైజ్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రూ.9లక్షల విలువైన గంజాయి లభ్యమైంది. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు మధిర నుంచి రైలులో తనిఖీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్లీపర్ కోచ్‌లో మూడు బ్యాగులు లభించాయి. వీటిని ఖమ్మం జీఆర్పీ స్టేషన్‌కు తీసుకొచ్చి పరిశీలించగా రూ.9లక్షల విలువైన 45.42కేజీల గంజాయి లభించింది. అయితే, గంజాయి తరలిస్తున్న వ్యక్తుల ఆచూకీ తెలియరాలేదని పోలీసులు తెలిపారు. తనిఖీల్లో జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో ఆత్మహత్య

**ఖమ్మంఅర్బన్:** ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్స్ సమీపకాల్వకట్టపై ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంకు చెందిన రాధాకృష్ణ మద్యానికి బానిస కాగా, భార్య కూడా పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈమేరకు 15వ తేదీన మద్యం మత్తులో గడ్డి మందు తాగిన ఆయన కుటుంబీకులకు ఫోన్ చేయడంతో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడని ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు. కాగా, రాధాకృష్ణ మృతదేహం వద్ద డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణంతో పాటు దానయ్య, సత్యం, ఆనందరావు తదితరులు నివాళులర్పించారు.

## ఖాతాదారుల డబ్బు వాడుకున్న క్యాషియర్

**మధిరరూరల్:** మధిర మండలం సిరిపురంలోని ఏపీజీవీబీలో నిధులు గల్లంతైన ఘటనలో క్యాషియర్ సురేష్‌పై కేసు నమోదైంది. ఖాతాదారులు అందజేసిన చేసిన నగదును వారి ఖాతాల్లో జమ చేసిన క్యాషియర్ బ్యాంకులో అందజేయలేదు. ఇలా సొంత అవసరాలకు రూ.16.97 లక్షలు వాడుకున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. దీంతో బ్రాంచ్ మేనేజర్ రవి ఫిర్యాదు మేరకు క్యాషియర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.డీ.రఫీ తెలిపారు.

## సినీ ఫక్కీలో మొబైల్ చోరీ

**నేలకొండపల్లి:** ప్రమాదంలో ఉన్నట్లు నటించి ఎదుటి వ్యక్తి సెల్‌ఫోన్ చోరీ చేసిన ఘటన ఇది. మండలంలోని కోనాయిగూడెంకు చెందిన బోయిన కొండలు మంగళవారం బైక్‌పై వస్తుండగా.. మరో బైక్‌పై వచ్చిన యువకుడు కింద పడిపోతున్నట్లు నటించాడు. దీంతో కొండలు సదరు వ్యక్తి బైక్‌ను పట్టుకుని లేపేందుకు యత్నిస్తుండగా, అప్పటికే కాచుకుని ఉన్న ఇంకో వ్యక్తితో కలిసి కొండలు జేబులోని సెల్‌ఫోన్ లాక్కుని ఉడాయించారు. కాగా ఇదే తరహాలో ఓ వ్యాపారి నుంచి సెల్‌ఫోన్ చేరీ చేశారు. దీంతో ఆగంతులను గుర్తించేందుకు పోలీసులు ఇకనైనా నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

## పట్టపగలే తాళం తీసి..

**కామేపల్లి:** గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలే ఇంట్లోకి చొరబడి బీరువాలో దాచిన నగదు, బంగారం దోచుకెళ్లిన ఘటన మండలంలోని ముచ్చర్ల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అడ్డగోడి వీరనాగయ్య ఈనెల 17న ఇంటికి తాళం వేసి ఎప్పటిలాగే దర్వాజపై తాళం చెవి పెట్టి వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం వీరనాగయ్య కుమారుడు రమేష్ ఎరువు బస్తా కోసం వచ్చేసరికి ఇంటి తాళం తీసి ఉండడంతో లోపల పరిశీలించగా బీరువా తాళం కూడా తీసి ఉంది. చోరీ జరిగినట్లు గుర్తించి పరిశీలించగా రూ.60 వేల నగదు, తులం బంగారం, 15 తులాల వెండిపట్టీలు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

## గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి


ఆనందరావు (ఫైల్)

**ఖమ్మంక్రైం:** ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ పి.ఆనందరావు గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం రాత్రి విధులు నిర్వర్తించిన ఆయన సోమవారం ఉదయం ఇంటికి వెళ్లాక గుండెపోటు రావటంతో ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందాడని వైద్యులు ధృవకరించారు. నేలకొండపల్లి మండలం చెరువు మాధారం రాయన్నపేటకు చెందిన ఆనందరావు మృదేహం వద్ద నగర ఏసీపీ హరికృష్ణ, సీఐ కుమారస్వామి, పోలీస్ ఉద్యోగుల అసోసియేషన్ బాధ్యులు వెంకటేశ్వర్లు, మోహన్‌రావు తదితరులు నివాళులర్పించారు.

**వైద్యం కోసం వస్తూ...**

**నేలకొండపల్లి:** వైద్యం కోసం వస్తున్న క్రమంలో గుండెపోటు రావడంతో మృతి చెందిన ఘటన ఇది. ముదిగొండ మండలం బాణాపురం తండాకు చెందిన భూక్యా కాల్యా(55) నేలకొండపల్లి ఆస్పత్రికి మంగళవారం బయలుదేరాడు. నేలకొండపల్లి పెట్రోల్ బంక్ దగ్గర ఆయన కుప్పకూలిపోవడంతో స్థానికులు ఆస్పత్రి తీసుకెళ్లేలోగా గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు.

## రైలు నుంచి జారి పడి...


వ్యక్తి మృతదేహం

**ఖమ్మంక్రైం:** రైలు నుంచి జారి పడడంతో తీవ్రంగా గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి (30) మృతి చెందాడు. ఖమ్మం రైల్వేస్టేషన్ పరిధిలోని మల్లెమడుగు, పాపటపల్లి మధ్య సోమవారం ఓ వ్యక్తి రైలులో జారి పడగా, జీఆర్పీ పోలీసులు ఆయనను ఆస్పత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిన సదరు వ్యక్తి వివరాల కోసం పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని జీఆర్పీ ఎస్ఐ భాస్కర్‌రావు సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ...


రాధమ్మ (ఫైల్)

**వైరారూరల్:** మండలంలోని రెబ్బవరం సమీపాన ద్విచక్రవాహనాన్ని వెనక నుండి లారీ ట్యాంకర్ ఢీకొట్టడంతో మహిళ మృతి చెందింది. వైరా మండలం గొల్లపూడికి చెందిన పార్లశ్ర రాధమ్మ తన కుమారుడు రాజేష్‌తో కలిసి సోమవారం తల్లాడ మండలం కలకొడిమలో అనారోగ్యంతో బాధపడుతున్న బంధువును పరామర్శించేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తోంది. రెబ్బవరం శివారు బంక్ వద్ద వీరి వాహనాన్ని వెనుక నుండి వ్చిన లారీ ట్యాంకర్ ఢీకొట్టగా రాధమ్మ కింద పడిపోయింది. ఆ వెంటనే ట్యాంకర్ రాధమ్మ తలపై నుండి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆతర్వాత ట్యాంకర్ డ్రైవర్ ఎదురుగా వస్తున్న మరో ఆటోను కూడా ఢీకొట్టగా డ్రైవర్ యకాల నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు పోలీసులు చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

## ఖమ్మంలో వ్యాపారి..

**ఖమ్మంఅర్బన్:** జిల్లా కేంద్రంలోని మమతరోడ్డులోని జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యాపారి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అమెరికాలో వ్యాపారం చేస్తున్న ఖమ్మం వాసి షేక్ నజీర్(36) రెండు నెలల క్రితం ఇక్కడకు వచ్చి శ్రీనివాస్‌నగర్‌లో నివాసముంటున్నాడు. కాగా, సోమవారం ఆయన ద్విచక్రవాహనంపై వస్తూ యూ టర్న్ తీసుకుంటుండగా ఇందిరానగర్ వైపు నుండి వేగంగా వచ్చిన మరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నజీర్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, ఆయనను ఢీకొట్టిన వాహనదారుడికి కూడా తీవ్ర గాయాలయ్యాయని ఖమ్మం అర్బన్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి తెలిపారు.

## చికిత్స పొందుతున్న వ్యక్తి...

**ముదిగొండ:** అనారోగ్యాన్ని తట్టుకోలేక పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని ముత్తారానికి చెందిన నారపొంగు కోటేశ్వరరావు(46) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన అనారోగ్యం బారిన పడగా ఈనెల 14న పురుగుల మందు తాగడంతో కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందడంతో కోటేశ్వరరావు కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.